క్లుప్తంగా

సన్మానం



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు మండల బీసీ అధ్యక్షుడిగా మండలంలోని సోములవారిపల్లె పంచాయతీకి చెందిన ఉమ్మడిశెట్టి సుబ్బయ్య (సెల్ సుబ్బయ్య) నియమితులయ్యారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డిని దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో సుబ్బయ్య కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, మాజీ జెడ్పీ కో ఆప్షన్‌మెంబర్ అక్బర్ బాషా, జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు గోటూరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో సామూహిక వరలక్ష్మీ వ్రతం

మైదుకూరు : మైదుకూరు లక్ష్మీ మాధవరాయ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మాధవాచార్యులు, లోకేశ్వ రాచారి మహిళలచే ఈ వ్రతం చేయించారు. తొట్లపల్లె అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి, ఆలయ చైర్మన్ బండి బెల్లం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఘన నివాళి



నాగూర్ షరీఫ్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కలసపాడు : స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, కలసపాడు ఎంపీటీసీ ఖుర్షిద్ బేగం భర్త షేక్ నాగూర్ షరీఫ్(58) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి నాగూర్ షరీఫ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నాగూర్ షరీఫ్ మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. పార్టీ అన్ని విధాలుగా వారి కుటుంబానికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సుధ రామకృష్ణారెడ్డి, సుదర్శన్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, పులివీరారెడ్డి, రాంబాబు, సింగరయ్య, రాజీవ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలకు సన్మానం

బద్వేలు అర్బన్ : మండల విద్యాశాఖాధికారి-1గా నియమితులైన ఎస్.మల్లిక, గతంలో ఇన్‌చార్జి మండల విద్యాశాఖాధికారి-1 గా పనిచేస్తూ రిలీవైన ఎస్.చెన్నయ్యలను శుక్రవారం జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని ఎమ్మార్సీ భవనంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎంఈఓగా పనిచేసిన చెన్నయ్య పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేశారని అన్నారు. అలాగే నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ కూడా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరకే యూరియా

పోరుమామిళ్ల : మండలంలోని రైతులకు ఎమ్మార్పీ ధరకే యూరియా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీధర్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి ఎరువుల దుకాణంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. పోరుమామిళ్ల పట్టణంలోని 7 దుకాణాలకు 58.95 టన్నుల యూరియా వచ్చిందన్నారు. దమ్మన్నపల్లె రైతు సేవా కేంద్రానికి 9.9 టన్నుల యూరియా మంజూరయిందన్నారు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద వ్యవసాయ సిబ్బంది ఉంటారని, రైతులకు యూరియా ఎమ్మార్పీ ధరకే అందేట్లు చూస్తారన్నారు.

మైదుకూరు వాసికి కీర్తిరత్న పురస్కారం

మైదుకూరు : మెగా హెల్పింగ్ ఫౌండేషన్ సంస్థ తనకు కీర్తిరత్న పురస్కారాన్ని ప్రకటించిందని మైదుకూరుకు చెందిన రచయిత, ఔత్సాహిక చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. సాహిత్యం, పర్యాటక ప్రదేశాలపై ఆయన సేవలకు మెచ్చిన సంస్థ హైదరాబాద్ లకిడీకపూల్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనుంది.

రాత పుస్తకాల పంపిణీ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోరుమామిళ్ల చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో స్థానిక ఎంపీపీ స్కూల్, లింగాలదిన్నెపల్లె, తొట్లపల్లె, నరసన్నపల్లె, కందిమల్లాయపల్లె, కొత్త బస్వాపురం, యాదవపాలెం, సోమిరెడ్డిపల్లె, రవీంద్రనగర్, గుండాపురం, టి.చౌదరివారిపల్లె, దేవనగరం, కేశవాపురం, పూండ్లచెన్నుపల్లె గ్రామాలలోని పాఠశాలల్లో 496 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

మోసం చేయడం బాబు నైజం



చంద్రబాబు మోసపు హామీలతో ఎంత మేర నష్టపోయారో జాబితాను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలివ్వడం ... అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సింగసాని గురుమోహన్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డులో గల కోటవీధిలో శుక్రవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలను సమావేశపరిచి చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి వివరించారు. ఒక్కో కుటుంబం చంద్రబాబు హామీలు అమలుకాకపోవడంతో ఎంత మేర నష్టపోయిందని క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయించి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తే నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి ఏటా రైతులకు రూ.13500లు రైతుభరోసా కింద అందిస్తే నేడు కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చి ఇప్పటి వరకు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. చివరకు రైతులకు విత్తనాలు, యూరియా కూడా సక్రమంగా పంపిణీ చేయలేకపోతున్నారని అన్నారు. అలాగే ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి వంటి పథకాలను నేటికీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై రెడ్‌బుక్ పేరుతో వేధిస్తూ అక్రమ కేసులు బనాయించడం తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. హామీలు ఎప్పుడు అమలు చేస్తారంటూ కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఎంత మేర లబ్ధి పొందారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఎంత మేర నష్టపోయారో గుర్తించాలని కోరారు. అనంతరం చంద్రబాబు మోసపు హామీలతో ప్రజలు ఎంత మేర నష్టపోయారు అనే జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి బిజ్జం రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, మున్సిపాలిటీ నాయకులు ఆవుల శ్రీను, అనిల్, ఎర్రగురు, రమణయ్య, శ్రీనివాసులు, వెంకట సుబ్బయ్య, చిన్ని, అబ్దుల్ సలాం, మహబూబ్‌బాష, ఇర్ఫాన్, చిన్నయ్య, పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహులు, మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు టి.సునీల్, ప్రధాన కార్యదర్శి ఓబుళాపురం ఓబులేసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు జీతాలివ్వండి

మైదుకూరు : ఇటీవల బదిలీ అయిన మోడల్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్, రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య డిమాండ్ చేశారు.
మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఆవరణలో జరిగిన ఎస్టీయూ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. మూడు పెండింగ్ డీఏలు, 11వ పీఆర్సీ, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2004 సెప్టెంబర్, 1వ తేదీకి ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలన్నారు. వై.వెంకటసుబ్బయ్య, మల్లేశ్వరరెడ్డి, బీకే.సురేష్, వెంకటేశ్వరరాజు, రమణయ్య, చెన్నకేశవప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం రాజోలి రిజర్వాయర్‌పై స్పందించకపోవడం దారుణం

ప్రొద్దుటూరు : జమ్మలమడుగు పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు రాజోలి రిజర్వాయర్‌పై స్పందించకపోవడం దారుణమని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, రాయలసీమ విద్యార్థి సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. రాజోలి రిజర్వాయర్ నిర్మాణం ద్వారా కుందూనదిలో వృథాగా పోతున్న నీటితో జిల్లాలో రైతులు రెండు పంటలు పండించుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కుందూ నదిలో 10వేల క్యూసెక్కులపైగా ప్రవాహం ఉందని తెలిపారు. రాయలసీమకు అవసరంలేని గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు అవసరామా అని ప్రశ్నించారు. విశాఖలో ఇప్పటికే స్టీల్ ప్లాంట్ ఉందని, ఇంకొక ప్రాజెక్టు అమలాపురం వద్ద రూ.లక్ష కోట్లతో నిర్మిస్తున్నారని, కడప జిల్లాలో కేవలంరూ.10 వేల కోట్లతో నిర్మిస్తున్న స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడుతున్నారన్నారు. రాయలసీమలో పుట్టిన చంద్రబాబు ఈ ప్రాంత అభివృద్ధి గురించి కాకుండా ఆంధ్రప్రాంత ప్రయోజనాలే చూస్తున్నారని విమర్శించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ప్రచారంలో నాగార్జునరెడ్డి, నాయకులు

పోరుమామిళ్ల : ఎన్నికల ముందు బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ స్లోగన్‌తో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మార్కాపురం, కొత్రపాటిపల్లె, కాలువకట్ట ఇందిరానగర్ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ అని వివరించారు. బాబు మాటలకు మోసపోయామని ప్రజలందరూ బాధ పడుతున్నారన్నారు. పాదయాత్ర చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారని, ప్రజల కోసం నవరత్నాలు అమలు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక అమలు చేసి ప్రజల అభిమానం పొందారని నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు లక్కినేని ఓబయ్య, డాక్టర్ మాబు, బత్తల గురుస్వామి, నాయకులు మునిరెడ్డి, సీతారామిరెడ్డి, పీరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి కల్యాణం పోస్టర్లు విడుదల



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ మాస కళ్యాణ పోస్టర్లు విడుదల చేశారు. సంఘ అధ్యక్షులు ఏకాబత్తుని జగన్‌మోహనాచారి మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠంలో ఈనెల 6న కల్యాణం కన్నుల పండుగగా జరుగుతుందన్నారు. కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరూ ఈ కల్యాణంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ల ఆవిష్కరణలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు నారోజు శ్రీనివాసాచారి, బాల నరసింహాచారి, కృష్ణమాచారి, వీరాచారి, వెంటకసుబ్బయ్యాచారి, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

రూ.4 వేల పింఛన్ ఇస్తున్న ప్రభుత్వం మాదే



వితంతువుకు పింఛన్ అందజేస్తున్న మంత్రి సవిత

మైదుకూరు : దేశంలో రూ.4 వేల పింఛన్ ఇస్తున్న ప్రభుత్వం తమదేనని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అన్నారు. మైదుకూరులో వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3 వేలుగా ఉన్న పింఛన్‌ను తమ ప్రభుత్వం రూ.4 వేలకు పెంచిందన్నారు. దేశంలో ఒకటో తేదీ పింఛన్ ఇస్తున్న రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ మాత్రమేనని, 67 లక్షల మందికి తల్లికి వందనం సొమ్ము అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేయాలి



దుర్గేష్‌ను సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : గండికోటలో శ్రీకృష్ణ దేవరాయల 100 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రొద్దుటూరు పట్టణ బలిజ సంఘం నాయకులు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు విన్నవించారు. శుక్రవారం ప్రొద్దుటూరు కొవ్వూరు గ్రాండ్‌లో మంత్రిని బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు సింగంశెట్టి గుమ్మటమయ్య, ప్రెసిడెంట్ మంచి రాజా, సభ్యులు జయశంకర్, ఘంటసాల వెంకటేశ్వర్లు, తుపాకుల చంద్రమౌళి, రిటైర్డు ఎస్ఐ శంకర్, జనసేన శివ తదితరులు కలిశారు. మంత్రికి వారు శాలువా కప్పి సన్మానించారు. శ్రీకృష్ణదేవరాయల జయంతిని రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని కోరినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని 6న జరిగే క్యాబినెట్ సమావేశంలో ప్రస్తావిస్తానని మంత్రి చెప్పినట్లు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మైదుకూరు : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని మైదుకూరు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. మైదుకూరు–2 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, తల్లులకు శుక్రవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శ్రీదేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి బిడ్డకు పాలు ఇవ్వాలని సూచించారు.

తల్లిపాలు శ్రేయస్కరం

చాపాడు : పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. మండలంలోని విశ్వనాథపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ.. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి రోగాలు రావన్నారు. అంగన్వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరు మండలంలో శనివారం ఉదయం 7.30 గంటల నుంచి 10.45 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాఘవేంద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మైదుకూరు సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ కడప రోడ్డు ఫీడర్, తెలుగుగంగ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్, ముక్కొండ సబ్ స్టేషన్ పరిధిలోని పెద్దశెట్టిపల్లె ఫీడర్, నంద్యాలంపేట సబ్ స్టేషన్ పరిధిలోని నంద్యాలంపేట 11కేవీ ఫీడర్లలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అదేవిధంగా ఉప్పగుంటపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని కట్టకిందపల్లె ఫీడర్, కూడలి సబ్ స్టేషన్ పరిధిలోని విపురాపురం ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ తీగలకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు జరుగుతున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

చాపాడు : మండల పరిధిలోని నక్కలదిన్నె, కేతవరం సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం చెట్ల తొలగింపు కార్యక్రమంలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్ కో జేఈ నరేంద్రరెడ్డి తెలిపారు. తిప్పిరెడ్డిపల్లె ఫీడర్, కేతవరం సబ్ స్టేషన్ పరిధిలోని బద్రిపల్లె ఫీడర్ క్రింద ఉదయం 7.30గంటల నుంచి 10.45 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేయడం జరుగుతుందని తెలిపారు.

సబ్సిడీ రుణాల మంజూరులో జాప్యమేల..?

ప్రొద్దుటూరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నించారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పన కోసం ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ కింద రుణాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించి ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. అయితే ఇంత వరకు అర్హుల జాబితా విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. రుణాల కోసం నిరుద్యోగ యువత ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీకుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభకనబరచిన ఐదు మంది విద్యార్థులకు మిద్దెల గ్రామానికి చెందిన క్లాస్–1 కాంట్రాక్టర్ అంబవరం చెన్నారెడ్డి రూ.లక్ష నగదు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులు స్నేహాంజలికి రూ.30వేలు, స్వాతికి రూ.25వేలు, శ్రావణ్ కుమారుకు రూ.20వేలు, మేఘనకు రూ.15వేలు, జగన్‌కు రూ.10వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–1 మహ్మద్ షఫి, ఎంఈఓ–2 నిర్మల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఎస్టీయూ, పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉర్దూ కళాశాలకు ప్రిన్సిపల్‌ను నియమించండి

మైదుకూరు : మైదుకూరు ఉర్దూ జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఇంటర్మీడియట్ ఆర్జేడీ సురేష్‌ను ఆయన శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మైదుకూరులో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటై పదేళ్లయినా ఇంత వరకూ రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించలేదని పేర్కొన్నారు. కళాశాల నిర్వహణలో అధ్యాపకులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వేంపల్లె ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా, అన్నమయ్య జిల్లా వృత్తి విద్యా విభాగం జిల్లా విద్యాశాఖ అధికారిగా ఉన్నందున మైదుకూరు కళాశాలలో విధులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని వివరించారు. వెంటనే రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని ఆయన కోరారు.

ఆంక్షలు పెట్టి జగన్ ప్రభంజనాన్ని ఆపలేరు

ఖాజీపేట : ఆంక్షలు పెట్టి జగన్ ప్రభంజనాన్ని కూటమి నాయకులు ఆపలేరని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని దుంపలగట్టు గ్రామంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతుండడంతో కూటమి నాయకుల వెన్నులో వణుకు పుడుతోందన్నారు. నెల్లూరు సెంట్రల్ జైల్‌లో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తుంటే జైలు చుట్టూ ముళ్ల కంచె వేయడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం చంద్రబాబు పర్యటన, లోకేస్ పాదయాత్రకు ఎలాంటి అడ్డు చెప్పలేదని, ఇపుడు వైఎస్సార్‌సీపీ అధినేతను అడ్డుకోవడం సిగ్గు చేటు అన్నారు. పెద్ద ఎత్తున బ్యారికేడ్లు, చెక్‌పోస్టులు, రోడ్లను తవ్వడం, సీసీ కెమెరాలు, డ్రోన్లు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి ఏమి జరిగినా కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వైఎస్సార్‌సీపీ నాయకులకు రక్షణ కల్పించేలా చూడాలని ఆయన కోరారు.

మాట నిలబెట్టుకోవాలి



పట్టణంలో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల : స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఈ విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. కార్యకర్తలతో కలసి శుక్రవారం పట్టణంలోని ప్రతి దుకాణం వద్దకు వెళ్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని వివరించారు. స్మార్ట్ మీటర్ల ఆదాయం అదాని ఆస్తులు పెంచేందుకు బీజేపీ పనిచేస్తున్నదన్నారు. టీడీపీ ప్రజలకు అన్యాయం చేయడంలో ముందున్నదన్నారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగంలేని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఈనెల 5న కరెంటు కార్యాలయాల వద్ద జరిగే ధర్నా లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయుసీ, ఇన్సాబ్, మహిళా సంఘాల నాయకులు చెన్నయ్య, సఫా, చాంద్‌బాష, శ్రీనివాసులు, విశ్వాసమ్మ, షాహిదా, ఆదెమ్మ, గురమ్మ, రామసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లీడింగ్ ఫైర్‌మెన్ సేవలు ప్రశంసనీయం



సన్మానిస్తున్న ఉద్యోగులు, సన్నిహితులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న ధనిరెడ్డి నారాయణరెడ్డి గురువారం పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో ఆయన పదవీవిరమణ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన పలువురు అధికారులు, అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ నారాయణ రెడ్డి గత 33 ఏళ్లుగా అగ్నిమాపక శాఖలో ఎనలేని సేవలు అందించారని తెలిపారు. అసోసియేషన్ నాయకుడిగా పనిచేస్తూ అటు అధికారులకు, ఉద్యోగుల మధ్య సమన్వయకర్తగా వ్యవహరించారన్నారు. అనంతరం ధనిరెడ్డి నారాయణ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని బద్వేలు తహసీల్దారు డి.ఉదయభాస్కర్‌రాజు హెచ్చరించారు. మండల పరిధిలోని పుట్టాయపల్లె గ్రామంలో గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందన్న విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం రెవెన్యూ సిబ్బందిని పంపి సంబంధిత ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టాయపల్లె గ్రామంలోని సర్వే నెంబర్ 253, 354, 358 లలో గల ప్రభుత్వ భూమిలో కొందరు చదును చేసి కబ్జాకు యత్నిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు సంబంధిత వీఆర్‌ఓను పంపి కబ్జాకు గురవుతున్న స్థలాన్ని పరిశీలించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలని చూస్తే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో యోగనరసింహస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీ శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో నరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి పర్వదిన సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున సుదర్శన యోగ నరసింహాస్వామి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి నూతన వస్త్రాలు, వెండి కవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. అలాగే శ్రావణ శుక్రవారం సందర్భంగా చాముండేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. మండల పరిధి నరసింహాపురంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



అంగన్వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి అన్నారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో పరిసరాల పరిశుభ్రత – వ్యాధులు దూరం అనే అంశంపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం వలన దోమలను నివారించవచ్చని, తద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ఇంటి పరిసరాలలోని డ్రమ్ముల్లో, ఎండిన కొబ్బరిబోండాల్లో, టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలని సూచించారు. బయట ఆహారం మానేసి ఇంట్లోనే పరిశుభ్రమైన ఆహారం తినాలని, కూల్‌డ్రింక్స్‌కు బదులు టెంకాయ నీళ్లు, పండ్లరసాలు, మజ్జిగతో పాటు కాచి వడగట్టిన నీటిని తాగడం ఉత్తమమన్నారు. హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు, ఏఎన్ఎంలు అఖిలభాను, గంగాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

3న మండల సమావేశం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 3న ఉదయం 10–30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ రమణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, జడ్పీ చైర్మెన్ రామగోవిందరెడ్డి హాజరవుతారన్నారు. సమావేశానికి సర్పంచులు, హాజరు కావాలన్నారు.